శనివారం 31-5-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 352, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



## కోమాలో ఉన్న భర్త ఆస్తిని భార్య అమ్ముకోవచ్చు

వివరాలు 3లో



## ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తారా?

వివరాలు 4లో



## సిగరెట్ తాగే అమ్మాయిల సంఖ్య పెరిగింది

వివరాలు 4లో

# బ్యాంకింగ్ వ్యవస్థలో భారీగా పెరిగిన మోసాలు

### 2023-24 ఆర్థిక సంవత్సరంలో 36,075 కేసులు ▪ కార్డు, ఇంటర్నెట్ మోసాలు 29,082 నమోదు

**ముందడుగు జాతీయం:**

దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థలో మోసాలు భారీగా పెరిగాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గురువారం వెలువరించిన తన వార్షిక నివేదికలో వెల్లడించింది. 2023 24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 36,075 మోసాలు నమోదయ్యాయి. 202122 ఆర్థిక సంవత్సరంలో 9,046, 202223 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 13,564 మోసాలతో పోలిస్తే ఈ సంఖ్య చాలా అధికం. అయితే, ఈ మోసాల్లో పోగొట్టుకున్న సొమ్ము మాత్రం గణనీయంగా తగ్గింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే క్రితం ఏడాది రూ.26,127 కోట్ల నుంచి రూ.13,930 కోట్లకు తగ్గిందని తెలిపారు.



గడిచిన మూడేళ్లలో ప్రైవేటు రంగ బ్యాంకుల్లో మోసాలు ఎక్కువగా నమోదవ్వగా.. పోగొట్టుకున్న మొత్తం విషయంలో ప్రభుత్వరంగ బ్యాంకులు ముందువరుసలో నిలిచినట్లు ఆర్‌బీఐ తన నివేదికలో తెలిపింది. డిజిటల్ పేమెంట్స్ (కార్డు పేమెంట్స్, ఇంటర్నెట్ ) మోసాలు అధిక సంఖ్యలో నమోదు కాగా.. లోన్ పోర్ట్‌ఫోలియోలో అధిక మొత్తంలో నగదు మోసగాళ్ల బారిన పడినట్లు నివేదికలో వెల్లడించింది. ఈ విషయంలోనూ ప్రభుత్వ రంగ బ్యాంకులే ముందువరుసలో ఉన్నట్లు పేర్కొంది.

202122లో 3,596 కార్డు, ఇంటర్నెట్ మోసాలు నమోదు కాగా.. ఆ సంఖ్య 2023 24లో 29,082కు పెరిగినట్లు ఆర్‌బీఐ నివేదిక తెలిపింది. ఇందులో కొద్దిపాటి నగదు మొత్తాలు అధిక సంఖ్యలో ఉన్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఈ తరహా మోసాల వల్ల కోల్పోయిన మొత్తం గడిచిన రెండేళ్లలో రూ.155 కోట్ల నుంచి రూ.1,457 కోట్లకు పెరిగింది. 202223, 2324 ఆర్థిక సంవత్సరాల్లో నమోదైన మోసాలకు సంబంధించి మరో ఆసక్తికర అంశాన్ని ఆర్‌బీఐ బయటపెట్టింది. మోసం జరిగిన తేదీకి, గుర్తించడానికి మధ్య చాలా గ్యాప్ ఉంటోందని ఆర్‌బీఐ గుర్తించింది.

## తెలంగాణ గీతానికి ప్రభుత్వం ఆమోదం

- జూన్ 2న గేయం జాతికి అంకితం
- ఇంకా ఖరారు కాని రాష్ట్ర అధికార చిహ్నం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



**ముందడుగు తెలంగాణ:**

జూన్ 2న 'జయ జయహే తెలంగాణ' గేయం జాతికి అంకితం చేస్తున్నామని, తెలంగాణ రాష్ట్ర గీతానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసిన రాష్ట్ర అధికార గీతంపై కాంగ్రెస్, మిత్రపక్ష నేతలు హర్షం వ్యక్తం చేశారు. సచివాలయంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, తెజస నేతలతో మిగతా 2లో

### వైద్య పరీక్షలు చేపించుకుంటా

## మధ్యంతర బెయిల్ పొడిగించండి

- జూన్ 9న జైలుకు వెళ్లి లొంగిపోతాను
- ఢిల్లీ కోర్టును ఆశ్రయించిన కేజ్రీవాల్

**ముందడుగు ఢిల్లీ:**

ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గురువారం రెగ్యులర్ బెయిల్ కోసం ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. వైద్య పరీక్షలు చేయించుకోవడానికి మధ్యంతర మిగతా 2లో



## పోలీసులపై దాడి చేసిన ఇండియన్ ఆర్మీ

వివరాలు 2లో

ముందడుగు
శుక్రవారం, 31-5-2024, హైదరాబాద్

# దేశంలో ముగిసిన చివరి దశ ప్రచారం

## 57 లోక్‌సభ స్థానాలకు జూన్ 1న పోలింగ్ ■ శనివారం సాయంత్రమే ఎగ్జిట్ పోల్స్ అంచనాలు

**ముందడుగు జాతీయం:**

దేశంలో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏడో దశ ఎన్నికల ప్రచార గడువు నేటి సాయంత్రంతో ముగిసింది. తుది దశ కావడంతో వివిధ రాజకీయ పార్టీల నేతలు ముమ్మర ప్రచారం నిర్వహించారు. మొత్తం ఏడు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతంలో 57 లోక్‌సభ నియోజకవర్గాలు జూన్ 1న పోలింగ్ జరగనుంది. ఇప్పటివరకు జరిగిన ఆరు దశల్లో 486 లోక్‌సభ సీట్లకు పోలింగ్ ముగిసింది.



ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లో 13 చొప్పున, పశ్చిమబెంగాల్‌లో తొమ్మిది, బిహార్‌లో ఎనిమిది, ఒడిశా ఆరు, హిమాచల్ ప్రదేశ్‌లో నాలుగు, ఝార్ఖండ్‌లో మూడు, కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్ లోక్‌సభ స్థానానికి శనివారం పోలింగ్ నిర్వహించనున్నారు. వీటితోపాటు ఒడిశాలో 42 అసెంబ్లీ స్థానాలకూ అదేరోజు ఓటింగ్ జరగనుంది. జూన్ 4 కౌంటింగ్ ఉంటుంది. మునుపటి ఎన్నికలతో పోలిస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ స్థాయిలో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి దాదాపు 200లకుపైగా బహిరంగ సభలు, రోడ్ షోలలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ నియోజకవర్గం వారణాసికి కూడా తుది దశలోనే పోలింగ్ జరగనుంది. తుది విడత పోలింగ్ శనివారంతో ముగియనుండడంతో అదే రోజు సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెలువడనున్నాయి.

# తెలంగాణ గీతానికి ప్రభుత్వం ఆమోదం

**ముందడుగు తెలంగాణ:**

సీఎం రేవంత్ రెడ్డి సమావేశయ్యారు. ఈ సందర్భంగా.. సంగీత దర్శకుడు కీరవాణి, ఆయన బృందం 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని ఆలపించారు. గీతంలో చేసిన మార్పులను కవి అందెశ్రీ వివరించారు. 13 చరణాలతో ఉన్న పూర్తి గీతం నిడివి 13.30 నిమిషాలు ఉంటుందని తెలిపారు. చరణాలు తగ్గించి రెండున్నర నిమిషాలతో రూపొందించిన గీతాన్ని కూడా వినిపించారు. రెండూ బాగున్నాయని నేతలు అన్నారు. మఖ్దూం మొహినుద్దీన్, కొమురం భీం, షేక్ బందగీ వంటి తెలంగాణ యోధుల పేర్లు కూడా ఆ గీతంలో చేర్చాలని నాయకులు సూచించగా.. పరిశీలించాలని కవి అందెశ్రీకి సీఎం సూచించారు. రాష్ట్ర అధికార చిహ్నాన్ని ఇంకా ఖరారు చేయలేదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. చిహ్నంపై ఎలాంటి భేషజాలు, పంతాలు లేవని చెప్పారు. అందరి సూచనలు తీసుకుంటామని.. అవసరమైతే కేబినెట్, అసెంబ్లీలో చర్చించాకే తుది నిర్ణయం ఉంటుందని తెలిపారు. సమావేశంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు తెలంగాణ జన సమితి నేత కోదండరాం, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# మధ్యంతర బెయిల్ పొడిగించండి




**ముందడుగు తెలంగాణ:**

బెయిల్‌ను పొడిగించాలంటూ మరో పిటిషన్ వేశారు. వీటిపై జరిగిన వాదనల్లో భాగంగా.. ఆయన అభ్యర్థనలను ఈడీ వ్యతిరేకించింది. ఎన్నికల వేళ విస్తృత ప్రచారం నిర్వహించకుండా ఆయన ఆరోగ్యమేమీ అడ్డంకిగా మారలేదని వెల్లడించింది. మనీ లాండరింగ్ కేసులో మార్చి 21న కేజ్రీవాల్ అరెస్టయిన సంగతి తెలిసిందే. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ ఆలస్యమవుతుండటంతో ఎన్నికల్లో ప్రచారం నిర్వహించుకునేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అభ్యర్థించారు. దీంతో సర్వోన్నత న్యాయస్థానం షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరుచేసింది. జూన్ 2న తిరిగి జైలుకు వెళ్లాలని ఆదేశించింది. బరువు తగ్గడం, కిడ్నీ సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు చేయించుకోవడానికి మధ్యంతర బెయిల్‌ను మరో ఏడు రోజుల పాటు పొడిగించాలని కేజ్రీవాల్ ఇటీవల సుప్రీంను ఆశ్రయించారు. జూన్ 9న జైలుకు వెళ్లి లొంగిపోతానని పేర్కొన్నారు. అయితే ఆ పిటిషన్ లిస్టింగ్‌కు బుధవారం సుప్రీం రిజిస్ట్రీ నిరాకరించింది. రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లేందుకు ఆయనకు స్వేచ్ఛ ఉందని, అందుకే ఈ పిటిషన్ విచారణకు అర్హమైనది కాదని వెల్లడించింది. దాంతో తాజాగా ఆయన ఢిల్లీ కోర్టుకు వెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం బెయిల్ విషయంలో ఈ శనివారంకల్లా స్పందన తెలియజేయాలని ఈడీని ఆదేశించింది.

# జమ్ము పూంఛ్ రహదారిపై ఘోర ప్రమాదం

- లోయలో పడ్డ ప్రయాణీకుల బస్సు
- 21 మంది మృతి, 40మందికి గాయాలు



**ముందడుగు జమ్మూకశ్మీర్:**

జమ్మూకశ్మీర్‌లోని జమ్ము పూంఛ్ రహదారిపై బస్సు అదుపుతప్పి లోయలో పడిపోవడంతో భారీ ప్రాణనష్టం సంభవించింది. 21 మంది మృతి చెందారని, 40 మంది గాయపడ్డారని అధికారులు వెల్లడించారు.

ఉత్తరప్రదేశ్‌లోని హథ్రాస్ నుంచి ప్రయాణికులతో బయల్దేరిన బస్సు.. జమ్ములోని అఖ్నూర్ ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. జమ్ముపూంఛ్ రహదారిపై అదుపుతప్పి లోయలో పడిపోయింది'' అని వెల్లడించారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగతున్నాయని చెప్పారు. గాయపడిన వారిని అఖ్నూర్‌లోని ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ''ఈ ఘటన తీవ్రంగా బాధించింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను'' అని సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు.



# పోలీసులపై దాడి చేసిన ఇండియన్ ఆర్మీ

- హౌస్ ఆఫీసర్‌తో ఐదుగురు పోలీసులకు గాయాలు
- 16 మంది ఆర్మీ సిబ్బందిపై కేసు నమోదు

**ముందడుగు జమ్మూకశ్మీర్:**

ఇండియన్ ఆర్మీ సిబ్బంది పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారు. ఈ దాడిలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)తోపాటు ఐదుగురు పోలీసులకు గాయాలయ్యాయి. ఈ ఘటన జమ్ముకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో చోటుచేసుకుంది. దీంతో సంబంధమున్న 16 మంది ఆర్మీ సిబ్బందిపైనా కేసు నమోదైంది. వీరిలో లెఫ్టినెంట్ కల్నల్ స్థాయి అధికారులు ముగ్గురు ఉన్నారు. మంగళవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఓ కేసు దర్యాప్తులో భాగంగా బాత్పొరా గ్రామంలో నివసిస్తున్న సైనికుడి ఇంట్లో మంగళవారం ఉదయం పోలీసులు సోదాలు నిర్వహించారు.

దీనిపై ఆగ్రహించిన సైనికాధికారులు తమ సిబ్బందితో కలిసి అదేరోజు రాత్రి 9.30 సమయంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి గలాటా సృష్టించారు. అక్కడున్న సిబ్బందిపై భౌతిక దాడికి దిగారు. పోలీసు ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు ఆర్మీ సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు పోలీసులు, ఆర్మీ మధ్య ఎలాంటి భౌతిక దాడి జరగలేదని రక్షణశాఖ అధికార ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. స్థానిక ఆర్మీ యూనిట్‌కు, పోలీసులకు మధ్య కార్యాచరణ పరమైన విభేదాలు తలెత్తిన మాట వాస్తవమేని, వాటిని సామరస్యంగా పరిష్కరించుకున్నామని తెలిపారు.

ముందడుగు
శుక్రవారం, 31-5-2024, హైదరాబాద్

# కోమాలో ఉన్న భర్త ఆస్తిని భార్య అమ్ముకోవచ్చు

## ఉత్తర్వులు జారీ చేసిన మద్రాస్ హైకోర్టు

**ముందడుగు తమిళనాడు:**

భార్యకు కోమాలో ఉన్న భర్త ఆస్తి విక్రయించే హక్కు ఉందని మద్రాసు హైకోర్టు ఉత్తర్వు ఇచ్చింది. అనారోగ్యంతో బాధ పడుతూ కోమాలోకి వెళ్లిన భర్త ఆస్తులకు తనను గార్డియన్‌గా నియమించాలని కోరుతూ చెన్నైకి చెందిన శశికళ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని పరిశీలించిన సింగిల్ బెంచ్ జడ్జి.. అందుకు చట్టంలో స్థానం లేదని, పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించి సివిల్ కోర్టును ఆశ్రయించాలని ఉత్తర్వు ఇచ్చారు. దీనిపై శశికళ అప్పీల్‌కు వెళ్లగా జస్టిస్ స్వామినాథన్, జస్టిస్ బాలాజీల ధర్మాసనం విచారించింది. చట్టంలో ఏ మార్గం లేకపోయినా 'సంరక్షకురాలు' అనేలా కోర్టు ఉత్తర్వులు ఇవ్వొచ్చు అని



గతంలో కేరళ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ధర్మాసనం ఈ సందర్భంగా గుర్తుచేసింది. భర్త ఆస్తుల నిర్వహణకు భార్యకు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను కొట్టివేసింది. శశికళను తన భర్త శివకుమార్‌కు గార్డియన్‌గా నియమించి, రూ.కోటి విలువైన ఆస్తిని విక్రయించేందుకు అనుమతించింది. అందులో రూ.50 లక్షలు శివకుమార్‌పై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వచ్చే వడ్డీ ఉపయోగించుకోవచ్చని తెలిపింది.

# ఒక్కో రోజు మూడు నుంచి ఐదు సభలు

- 75 రోజుల్లో 180 ర్యాలీలు నిర్వహణ
- ప్రచారంలో దూకుడు పెంచిన మోడీ
- ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 31 సభలు

**ముందడుగు జాతీయం:**

దేశంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రధాని మోడీ ప్రచార బాధ్యతలు భుజాన కెత్తుకున్నారు. ఈ ఎన్నికలతో హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా దూసుకెళ్తున్న బిజెపి ప్రచారంలోనూ ఆ దూకుడు సాగించింది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ సుడిగాలి పర్యటనలు చేపట్టారు. ఒక్కో రోజు మూడు నుంచి ఐదు సభల్లో పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. మొత్తంగా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత నుంచి ఈ రెండున్నర నెలల్లో ప్రధాని దాదాపు 180 ర్యాలీలు నిర్వహించారు.



### మే నెలలోనే 96 సభలు..

ఈ ఏడాది మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. అప్పటి నుంచి భాజపా ప్రచార వేగాన్ని పెంచింది. ఈ 75 రోజుల్లో ప్రధాని దేశం నలుమూలలా ర్యాలీలు, రోడ్‌షోల్లో పాల్గొన్నారు. 22 రోజుల పాటు నిత్యం నాలుగు చోట్ల ప్రచారాలు చేపట్టారు. మూడు పర్యాయాలు అయితే ఒక్క రోజులోనే ఐదేసి సభలు నిర్వహించారు. ఈ మే నెలలోనే ప్రధాని 96 ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### ఆ నాలుగు రాష్ట్రాలపై గురి..


ప్రధాని చేపట్టిన ప్రచారాల్లో దాదాపు సగం ర్యాలీలు కేవలం నాలుగు రాష్ట్రాల్లోనే ఉండటం గమనార్హం. 80 మంది ఎంపీలను ఎన్నుకునే ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 31 సభలు నిర్వహించారు. ఆ తర్వాత బిహార్‌పై దృష్టిపెట్టిన ప్రధాని ఆ రాష్ట్రంలో 20 ర్యాలీల్లో పాల్గొన్నారు. ఇక, మహారాష్ట్రలో 19, పశ్చిమ బెంగాల్‌లో 18 ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. 2019తో పోలిస్తే మహారాష్ట్రలో ఈసారి మోదీ రెట్టింపు స్థాయిలో ర్యాలీలు నిర్వహించారు. మొత్తంగా ఈ నాలుగు రాష్ట్రాల్లో కలిపి 88 ర్యాలీలు చేపట్టారు.

# సగటున 100కు పైగా మొబైల్స్ పోతున్నాయి

- మన మొబైల్స్ ఎక్కువగా సూడాన్ దేశానికే
- స్థానిక దొంగలతో అంతర్జాతీయ ముఠాల సంబంధాలు

**ముందడుగు హైదరాబాద్:**

హైదరాబాద్ నగరంలో రోజూ సగటున 100కు పైగా మొబైల్‌ఫోన్లు దొంగలిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఐఎంఈఐ నంబర్లు మార్చి దర్జాగా దేశం దాటిస్తున్నారు. దీంతో పోలీసులు గుర్తించలేకపోతున్నారు. నగరంలో ఫోన్లలో 70శాతం చోరీకి గురవుతుంటే.. 30శాతం పనిచేసే ప్రదేశాలు, ప్రయాణాల్లో నిర్లక్ష్యం, ఏమరపాటుతో పారేసుకుంటున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలుతుంది. మరికొందరు తక్కువ ధరకు కొనుగోలు చేసిన సెల్‌ఫోన్లు మాయమైనట్టు గుర్తించినా తేలికగా తీసుకుంటున్నారు. కీలక సమాచారం, వ్యక్తిగత వివరాలు, ఖరీదైనవి పోగొట్టుకున్నప్పుడు మాత్రమే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. మాయమైన ఫోన్లను కొందరు సిమ్‌కార్డులు మార్చి వాడుకుంటుంటే.. దొంగలు వాటిని విక్రయించి సొమ్ము చేసుకుం



టున్నారు. నిన్నటి వరకూ సెల్‌ఫోన్ల స్నాచింగ్స్ మద్యం, గంజాయి, రోజువారీ అవసరాల కోసం పాల్పడుతున్నట్టు భావించారు. తాజా ఘటనలతో ఇదంతా వ్యవస్థీకృత నేరాలనే అంచనాకు వచ్చారు. గృహదొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లతో దొరికిపోతామనే భయంతో స్నాచర్లు, జేబుదొంగలు, పాత నేరస్థులు రూటు మార్చారు.

### రద్దీ ప్రాంతాల్లోనే దొంగిలిస్తున్నారు..

దేశ, విదేశాల్లో సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్ల డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు స్థానిక దొంగలతో అంతర్జాతీయ ముఠాలు జతకడుతున్నాయి. నైజీరియా, సూడాన్, ఇరాన్ తదితర దేశాల నుంచి విద్య, వ్యాపారం, పర్యాటక వీసాలతో హైదరాబాద్, బెంగళూరు, దిల్లీ, ముంబయి చేరిన విదేశీయులు ఇక్కడి దొంగలతో స్నేహం చేస్తున్నారు. మైనర్లు, జేబుదొంగలతో ముఠాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, ఆటోలు, రద్దీ ప్రాంతాలను చోరీలకు వేదికగా మార్చుకున్నారు. కొన్ని ముఠాలు రాత్రిళ్లు ఒంటరిగా వెళ్లే వారిని అటకాయించి ఆయుధాలతో బెదిరించి సెల్‌ఫోన్లు కాజేస్తున్నారు. ఇటీవల అరెస్టయిన సూడాన్ దేశస్థుడు ప్రతి నెలా రెండుసార్లు హైదరాబాద్ వస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ప్రతి 15 రోజులకోసారి నగరానికి చేరి 1500 సెల్‌ఫోన్లు సేకరించి సముద్రమార్గంలో తమ దేశానికి చేరవేసినట్టు నిర్ధారించారు.

# కొడుకు స్థానంలో తల్లి రక్త శాంపిల్స్

- రక్త నమూనా నివేదికను మార్చిన వైద్యులు
- పుణె టీనేజర్ కారు డ్రైవింగ్ కేసులో కొత్త విషయాలు

**ముందడుగు మహారాష్ట్ర:**

పుణెలో జరిగిన టీనేజర్ కారు ర్యాష్ డ్రైవింగ్ కారణంగా ఇద్దరు టెకీలు మృతి చెందిన కేసులో పలు విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రధాన నిందితుడైన మైనర్ రక్త నమూనా పరీక్ష నివేదికను వైద్యులు మార్చేసినట్లు ఇదివరకు వెల్లడైన సంగతి తెలిసిందే. దానిని తన తల్లి రక్త నమూనాతో మార్చివేసినట్లు పోలీసులు వర్గాలు వెల్లడించాయి. డాక్టర్ శ్రీహరి హల్నోర్ వాటిని తీసుకున్నట్లు తెలిపాయి.



నిందితుడి రక్త నమూనాలు మార్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ శ్రీహరి హల్నోర్‌పై వేటుపడింది. సాసూన్ జనరల్ ఆస్పత్రి నుంచి తొలగించారు. అతడిని సర్వీసు నుంచి పూర్తిగా డిస్మిస్ చేసినట్లు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్ అండ్ రీసెర్చి ఆఫ్ మహారాష్ట్ర ప్రకటించింది. దీంతోపాటు ఈ కేసులో ఉన్న ఫోరెన్సిక్ విభాగం అధిపతి డాక్టర్ తావ్‌డేపైనా సస్పెన్షన్ వేటు వేసింది. హల్నోర్, తావ్‌డేతో పాటు ఒక గుమస్తాను పోలీసులు అరెస్టు చేశారు. బ్లడ్ టెస్ట్ జరిగినప్పుడు మైనర్ తల్లి ఆసుపత్రిలో ఉన్నట్లు, వైద్య సిబ్బంది అరెస్టు తర్వాత నుంచి ఆమె పరారీలో ఉన్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆమెకోసం గాలిస్తున్నారు.

ముందడుగు

శుక్రవారం, 31-5-2024, హైదరాబాద్



# ముస్లిం పురుషుడు, హిందూ యువతి వివాహం చెల్లదు

▪ ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం కూడా కుదరదు

▪ మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు

**ముందడుగు మధ్యప్రదేశ్:**

వ్యక్తిగత చట్టం ప్రకారం, ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం కూడా ముస్లిం పురుషుడు, హిందూ యువతి వివాహం ముస్లిం చెల్లదని మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. మతాంతర వివాహాన్ని నమోదు చేసుకోవడం కుదరదని స్పష్టం చేసింది. పోలీస్ రక్షణలో ప్రత్యేక వివాహం కోసం ఒక జంట చేసిన అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ముస్లిం వ్యక్తి, హిందూ మహిళ పెళ్లి చేసుకోవాలని భావించారు. అయితే వారిద్దరూ తమ మతాన్ని వదులుకోక కొనసాగించాలని నిర్ణయించారు. దీంతో పోలీస్ రక్షణ కల్పించడంతోపాటు ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం పెళ్లి చేసుకునేందుకు అనుమతించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. న్యాయమూర్తి గుర్పాల్ సింగ్ అహ్లూవాలియా నేతృత్వంలోని ధర్మాసనం ఇరు వర్గాల వాదనలు విన్నది. ముస్లిం పురుషుడు, హిందూ మహిళ కలిసి ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం వివాహం చేసుకున్నప్పటికీ ముస్లిం వ్యక్తిగత చట్టం ప్రకారం ఆ పెళ్లి చెల్లదని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక వివాహానికి అనుమతించాలన్న ఆ జంట పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. మే 27న ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

# సిగరెట్ తాగే అమ్మాయిల సంఖ్య పెరిగింది

10 ఏళ్లలో అమ్మాయిల సంఖ్య రెట్టింపు ▪ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నివేదికలో వెల్లడి

**ముందడుగు జాతీయం:**

సిగరెట్ ప్యాకెట్లపై సిగరెట్ తాగడం ఆరోగ్యానికి హానికరం...' అని చట్టబద్ధమైన హెచ్చరిక రాసి ఉన్నా యువతలో వ్యసనం పెరిగిపోతోంది. గత దశాబ్ద కాలంలో భారతదేశంలో సిగరెట్లు, బీడీలు తాగే లోపు వయసున్న యువత సంఖ్య పెరిగిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కొత్త నివేదిక వెల్లడించింది.



### సిగరెట్లు, బీడీల వినియోగం పెరిగింది

భారత్‌లో పొగాకు నియంత్రణ 2022' పేరుతో రూపొందించిన ఈ నివేదికలో దేశవ్యాప్తంగా పొగాకు వినియోగించే వారి సంఖ్య తగ్గుముఖం పట్టిందని.. అయితే సిగరెట్లు లేదా బీడీల వినియోగం పెరిగిందని తెలిపింది. ఆందోళనకరమైన విషయమేమిటంటే ప్రస్తుతం యువతులలో సిగరెట్లు, బీడీలు తాగే అలవాటు వేగంగా పెరుగుతోంది. 2009 నుంచి 2019 మధ్య అంటే 10 ఏళ్లలో స్మోకింగ్ చేసే అమ్మాయిల సంఖ్య రెండింతలు పెరిగిందని ఈ నివేదిక తెలియజేస్తోంది. ధూమపానం చేసే అబ్బాయిల సంఖ్య కూడా పెరిగింది.. కానీ అంతగా లేదు.

### కొత్త తరంలో పెరిగిన ధూమపానం


ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన ఈ నివేదికలో.. 2009లో దేశంలో 2.4% మంది అమ్మాయిలు ధూమపానం చేశారని పేర్కొంది. కాగా, 2019లో అది 6.2 శాతానికి పెరిగింది. అంటే ఈ 10 ఏళ్లలో స్మోకింగ్ చేసే అమ్మాయిల సంఖ్య 3.8% పెరిగింది. అదేవిధంగా 2009లో 5.8% మంది అబ్బాయిలు ధూమపానం చేశారు. 2019లో వారి సంఖ్య 8.1 శాతానికి పెరిగింది. అంటే, 10 సంవత్సరాలలో ధూమపానం చేసే అబ్బాయిల సంఖ్య 2.3% పెరిగింది. ఈ పద్ధతిలో చూస్తే 10 ఏళ్లలో స్మోకింగ్ చేసే అబ్బాయిల సంఖ్య అమ్మాయిల కంటే పెద్దగా పెరగలేదు. ఈ నివేదికలో ఆందోళనను పెంచే మరో అంశం కూడా ఉంది. కొత్త తరం మరింత వేగంగా ధూమపానానికి అలవాటు పడుతున్నట్లు ఈ నివేదిక తెలియజేస్తోంది. నివేదిక ప్రకారం.. 2017లో 1.5% వయోజన మహిళలు ధూమపానం చేశారు. కాగా 2019లో 6.2% మంది అమ్మాయిలు ధూమపానం చేస్తున్నట్లు గుర్తించారు. దీన్నిబట్టి రాబోయే తరం స్మోకింగ్‌కు బానిసలుగా మారుతున్నట్లు తెలుస్తోంది

# ఫోన్ ట్యాపింగ్ పై బీజేపీ ఆందోళన

▪ నేడు ధర్నాకు పిలుపు

▪ ఇందిరాపార్కు వేదికగా నిర్వహించాలని బీజేపీ నిర్ణయం

**ముందడుగు, హైదరాబాద్:**



ఫోన్ ట్యాపింగ్ పై బీజేపీ ఆందోళనలకు సిద్ధమవుతోంది. ఈ కేసును సీబీఐ విచారణకు ఆదేశించాలని కమలం పార్టీ డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ కోరి అధికారంలోకి వచ్చాక ఆ అంశాన్ని పట్టించుకోలేదని పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారు. అందుకే ఈ కేసును కూడా నీరుగారుస్తారనే ఉద్దేశ్యంతో బీజేపీ అలర్ట్ అయి ధర్నాకు పిలుపునిచ్చింది. ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వేదికగా శుక్రవారం ధర్నా చేపట్టాలని శ్రేణులు భావిస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు కూడా సిద్ధం చేస్తున్నారు. కాగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో ధర్నా చేపట్టేందుకు ఎన్నికల కమిషన్ కు బీజేపీ నేతలు లేఖ రాశారు. కాగా ధర్నాకు అనుమతి లభించినట్లు బీజేపీ నేత స్పష్టంచేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని దేశద్రోహంగా భావించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని విచారణలో చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ధర్నా చౌక్ నుంచి ప్రశ్నించనుంది. కాంగ్రెస్ సర్కార్ ఈ కేసులో ఇన్వాల్వ్ అయిన కీలక వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. కాగా బీఆర్ఎస్ ఓటుకు నోటు కేసులో కూడా బీఎల్ సంతోష్ ను టార్గెట్ చేయాలని భావించడం పై బీజేపీ సీరియస్ గా ఉంది.

# ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తారా?

▪ రాజముద్రను మార్చడం సరికాదు

▪ చార్మినార్‌ను తొలగించడం అంటే హైదరాబాదీలను అవమానించడమే

▪ ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలి లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం

▪ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ముందడుగు,స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ ప్రభుత్వం మూర్ఖపు నిర్ణయాలు తీసుకుంటున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలతో తెలంగాణ సాధించుకున్నామని చెప్పారు. పదేండ్లలో సాధించిన ప్రగతిని కాదని కాంగ్రెస్ సర్కార్ మొండి వైఖరి అవలంభిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పుల నేపథ్యంలో మాజీ మంత్రులు పద్మారావు గౌడ్, రాజయ్య, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, పార్టీ నాయకులతో కలిసి చార్మినార్ వద్ద కేటీఆర్ నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లోగో నుంచి కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశపూర్వకంగా రాజముద్రను మారుస్తున్నదని చెప్పారు. హైదరాబాద్ అంటే అందరికీ గుర్తొచ్చేది చార్మినార్ అని తెలిపారు. ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించొద్దని సూచించారు. కాగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే మార్పు చేస్తున్నదని తెలిపారు. రాజముద్రను ఇంత అత్యవసరంగా మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.

# తెలంగాణ దశాబ్ది వేడుకలకు సోనియా గాంధీ

హాజరుకావాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడి



**ముందడుగు జాతీయం:**

తెలంగాణ రాష్ట్రంలో దశాబ్ది వేడుకలను నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకలకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు ఇప్పటికే ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన ఆమె వేడుకలకు హాజరుకావాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ మేరకు సోనియా గాంధీ కార్యాలయం నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయానికి సమాచారం వచ్చింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ వర్గాలు ధ్రువీకరించాయి. రాష్ట్ర అవతరణ వేడుకలకు హాజరుకావాలని ఇటీవల ఢిల్లీ వెళ్లి మరి సీఎం రేవంత్ రెడ్డి సోనియాగాంధీని ఆహ్వానించారు. జూన్ రెండో తేదీన తెలంగాణ ప్రభుత్వం ఘనంగా ఈ వేడుకలను నిర్వహించనున్న నేపథ్యంలో.. హాజరుకావాలని సోనియాగాంధీ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే సోనియా గాంధీ పర్యటనకు సంబంధించిన పూర్తిస్థాయి షెడ్యూల్ రావాల్సి ఉందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.